ద్రవ్యయజ్ఞం - జ్ఞానయజ్ఞం

యజ్ఞము అంటే ఆరాధన అని కొందరు, ద్రవ్యములను దేవతలకు సమర్పించు విధానమని కొందరు, చిన్న గుండమునుగావించి అందులో అనేక వస్తువులను మంత్రయుక్తముగ వేసి కాల్చి వేయడమేనని కొందరు అనుకొనుట అలవాటై ఉన్నది. ఏది ఏమైన చిన్న గుంత త్రవ్వి అందులో ఏదో వేసి కాల్చడమే యజ్ఞమని సామాన్య మానవునియందున్న భావన. భగవంతుడు గీతయందు తెల్పిన ప్రకారము మనము చూస్తున్న యజ్ఞములు ధర్మసహితమయినవా అధర్మసహితమైనవా అని తెలుసుకోవడము ముఖ్యము. ఆత్మను (దేవుని) తెలుసుకోవడానికి సాధన చేస్తే సరిపోతుంది ఇవన్ని తెలుసుకోవడము దేనికి అని కొందరు అనుకొనువారు కూడ కలరు. దానికి సమాధానమేమనగా! ధర్మము తెలియనిదే ధర్మముల మీద ఆధారపడిన దేవుడు తెలియడు. అందువలననే కదా! విశ్వశక్తి విశ్వవ్యాపి అయిన పరమాత్మ శరీరము ధరించి మన మధ్యకు వచ్చి అన్ని ధర్మములు తెలియజేశాడు. ధర్మములను తెలిసి సంపూర్ణ జ్ఞానికానిదే ఎవరు దేవుని తెలియలేరని ఆ దేవుడే 'శ్రేయోహి జ్ఞాన మభ్యాసాత్' అన్నాడు. కనుక ప్రతి విషయము ధర్మ సమ్మతముగ తెలిపి అధర్మ సహితమైన వాటిని వదలి వేసినపుడే దేవుని తెలియుటకు అవకాశము గలదు. అట్లు కానినాడు దేవుని తెలియుట పొందుట కష్టము. అందువలన యజ్ఞముల గూర్చి మనము అవగాహన చేసుకొన్న విషయములను ధర్మబద్ధమా కాదా అని చూడవలసిందే.

ధర్మమునకు బలము దేవుడొక్కడే అధర్మమునకు బలము యావత్ ప్రపంచము. అందువలన ఈ ప్రపంచములో అధర్మములకే ప్రజలు ప్రాధాన్యత ఇవ్వడము జరుగుచున్నది. ధర్మములు కొరగానివైనపుడు ధర్మములకు బలము చేకూర్చడము కోసము ఆ దేవుడే అవతరించి చెప్పవలసిందే. అధర్మములకు అట్లు కాదు అధర్మమలు మానవుని చేతనే ప్రచారము కాబడుచున్నవి. దేవుడొక్కడు మానవునిగ వచ్చి ధర్మములు చెప్పితే, మానవులెందరో ఇదియే నిజధర్మమని మానవునిగ వచ్చిన దేవుని మాటకు వ్యతిరిక్తముగ ప్రచారము చేసుకొనుచుందురు. దైవాంశ కల్గిన ఒక్క మానవుని చేత తెల్పబడిన ధర్మములకు వ్యతిరిక్తముగ ఎందరో మానవుల చేత తెల్పు అధర్మములు దాటికి ధర్మములు మాసిపోవుచుండును. అందువలననే దేవుడు అప్పుడప్పుడు పుట్టవలసి వస్తున్నదని గీతయందు అన్నాడు.

సామాన్య మానవుడు ధర్మములను గాని, అధర్మములను గాని ప్రచారము చేయు స్థితియందుండడు. కాని ఇక్కడ అధర్మములను ధర్మములుగ మలచి చూపిస్తు దేవుని మాటకు వ్యతిరిక్తముగ ప్రచారము చేయుటకు అవకాశము జ్ఞానము బోధించు స్థోమత కల్గినవారికి మాత్రమే ఉండును. సామాన్య మానవునికి ఏది తెలియదు కావున బోధించువారు చెప్పినట్లు నడచుకొనుచుందురు. కాని విమర్శించు శక్తి వినే వారికి ఉండదు. ఇటువంటి వాతావరణములో అధర్మములు సులభముగ ప్రాకి ప్రజలయందిమిడి పోవుచున్నవి. ఆ విధముగ ఎందరి చేతనో చెప్పబడి బహుళ ప్రచారములో ఉన్న అధర్మములను దేవుడే అవతరించి ఖండించవలసి వచ్చినపుడు చూసేవారికి దేవుడు కూడ ఒక మనిషిలాగే కనిపిస్తుంటాడు కావున ఎందరో చెప్పిన దానికంటే నీవు చెప్పునది నిజమా? పెద్దలందరు తెల్పినది నీ ఒక్కడవు కాదంటావా? అని అంటారు. కాని ఈయన చెప్పునది ఏమి? ఇంతకు ముందు మనమిన్నదేమి? ఏది నిరూపణకు వచ్చు సత్యము అని యోచించరు. అందువలన పరమాత్మయే కృష్ణునిగా పుట్టినపుడు ధర్మములను ప్రజలకు చెప్పితే ఎందరో మునులు చెప్పిన దానికంటే నీవు వ్యతిరిక్తముగ నాది ధర్మమంటావా? నీకంటే ముందు పుట్టినవారు తెల్పినది

అధర్మమంటావా? కంఠోరమైన బ్రహ్మచారులు మహర్షులు జీవితమంతా ఒకే ఆచరణలో ఉన్నవారు తెల్పిన మాటలు అధర్మములు, ఎందరో భార్యలు గల నీవు మామూలుగ అన్ని విషయములందు తలదూర్చు నీవు చెప్పునది ధర్మమా అని ఎదురు ప్రశ్నవేస్తారని అవకాశమొచ్చినపుడు అర్జునునికి మాత్రము తెల్పిపోయాడు. శాసనములు, సిద్ధాంతములు, నిరూపణలు అయిన ఆనాటి కృష్ణుని వాక్యములు కూడ ఈనాడు వక్రబాస్యము ఏర్పడినది. ముందు పుట్టి గడ్డములు పెంచి చెప్పిపోయిన వారి మాటలన్ని వేదములని, ఉపనిషత్తులని అందులోని వాక్యములే ధర్మములని గ్రుడ్డిగ నమ్ముచు సత్యాసత్య విమర్శ లేక ఈనాడు గీతను కూడ వెనక్కు నెట్టినవారున్నారు. పిప్పలాద మహర్షి చెప్పిన గర్భోపనిషత్‌లోని వాక్యములను గ్రుడ్డిగ నమ్ముచు గీతలో స్వయముగ దేవుడే చెప్పిన 'వాసాంసి జీర్ణాని' అను శ్లోకమునే అర్థరహితము చేసారు. జీవుడు శరీరమును పొందు విషయమును తెల్పిన ఆ శ్లోకము యొక్క సత్యమునే సమాధి చేసారు. దానికి విరుద్ధముగ వారు అట్లు చెప్పారు, వీరు ఇట్లు చెప్పారు అని అంటారు కాని ఏది సత్యము అని యోచించరు. అసలుకు కొందరి భావములో కృష్ణుడంటే సామాన్య మానవుడని లెక్క. సామాన్య మానవులను దేవునిగ లెక్కించు గౌరవించు మనుషులు నిజమైన దేవుడు మనిషిగ వచ్చినప్పటికి గుర్తించలేక పైగా సామాన్యులకంటే నీచముగ లెక్కించుకొన్నందులకు మేము బాధపడుచున్నాము. ఇపుడు ధర్మయుక్తముగ, శాస్త్రబద్ధముగ యజ్ఞమంటే ఏమిటో తెలుసుకొందాము.

యజ్ఞమనగ వ్రేల్చుట లేక కాల్చుట అని అర్థము. ఇక యజ్ఞము జరుగుచున్నదంటే కాల్చేదానికి ఒక అగ్ని కావాలి. కాల్చబడే దానికి ఒక వస్తువు కావాలి. కాల్చే దానికి ఒక మనిషి కావాలి. ఇది అందరికి తెలిసిన విషయమే కదా! ఎక్కడ యజ్ఞములు జరిగిన యజ్ఞగుండములో అగ్ని ఉంటుంది. అందులోనికి వేసే వస్తువులు చిన్న పుల్లలు మొదలుకొని గొప్ప ఔషదములు, పట్టుచీరలు, బంగారు, నెయ్యి ఎన్నో ఉన్నవి. అట్లే వాటిని నెరవేర్చుటకు ఋత్త్విక్కులు అనువారు ఉన్నారు కదా అనుట సహజమే. కాని ఇది ధర్మమో అధర్మమో తెలియదు కాని యోగశాస్త్రమైన గీతయందు చెప్పినది మాత్రము ధర్మము. దానిని బట్టి యజ్ఞములు రెండు విధములుగ విభజింపబడినవి. **1) ద్రవ్యయజ్ఞము 2) జ్ఞానయజ్ఞము.** ద్రవ్యయజ్ఞము ప్రకృతి సంబంధమైనది. పరమాత్మను పొందుటకు ఈ యజ్ఞము పనికిరాదు. ప్రకృతిలో పుట్టిన కంటికి కనిపించు వస్తువులను కాల్చివేయునది కావున దీనికి ద్రవ్యయజ్ఞమని పేరు పెట్టారు. ఈ యజ్ఞము ద్రవ్యములను కాల్చుచు జన్మకు కారణమైన కర్మను వృద్ధి చేయును. కాని ప్రతి జీవరాసి ద్రవ్యయజ్ఞమును చేయగల్గుచున్నాయి. ద్రవ్యయజ్ఞము కంటే అన్ని విధముల భిన్నమైనది శ్రేష్టమైనది జ్ఞానయజ్ఞము. ఈ యజ్ఞము ఆత్మ పరమైనది. సర్వ కర్మలు జ్ఞానయజ్ఞమందు కాలిపోయి జన్మ లేకుండ ముక్తిని కల్గిస్తున్నది. అందువలననే గీతయందు జ్ఞానయోగము 33వ శ్లోకము.॥

శ్లో ॥ శ్రేయాన్ ద్రవ్య మయా ద్యజ్ఞాత్ జ్ఞాన యజ్ఞః పరంతప !
సర్వం కర్మాఖిలం పార్థ జ్ఞానే పరి సమాప్య తే !!

ద్రవ్యయజ్ఞముకంటే జ్ఞానయజ్ఞము శ్రేష్టమైనది. ఎందుకు అనగా! సర్వ కర్మలు జ్ఞానాగ్నిలో పరి సమాప్తమౌను అని దేవుడన్నాడు. దేవుడు చెప్పిన ఈ యజ్ఞములేవో ఎక్కడున్నవో ఎలా జరుగుచున్నవో ఎవరు చేయుచున్నారో తప్పక తెలుసుకోవలసి ఉన్నది. దేవుడు తెల్పిన ఈ యజ్ఞముల వివరము తెలిసినవాడు మానవుడు చెప్పి చేయించు యజ్ఞముల ఎడల మోసపోడు.

8వ అ.4వ శ్లో. *'అది యజ్ఞో హమే వాత్ర దేహే దేహ భృతాం వర'* సర్వ దేహములందుండి యజ్ఞములకు నేనే భోక్తగాయున్నాను. అను దేవుని మాటననుసరించి రెండు విధముల యజ్ఞములు మన దేహములందే జరుగుచుచున్నవని తెలియుచున్నది. ద్రవ్యయజ్ఞము సర్వ జీవరాసుల శరీరములోని జీర్ణాశయములో జఠరాగ్ని చేత జరుగుచున్నది. జీర్ణాశయములో కలిసెడి రసముల చేత అగ్ని ప్రభావమేర్పడి మనము నిత్యము తింటున్న ద్రవ్యములను భస్మీపటలము చేయుచున్నది. జీర్ణాశయములో ఏదో అగ్ని ఉన్నదనుటకు మన నోటి ద్వారములో వేడికన్పిస్తున్నది. నోటి ద్వారములో వేయు వివిధ రకములైన ద్రవ్యములు యజ్ఞగుండమైన జీర్ణాశయములో పడికాలిపోయి మార్పుచెందుచున్నవి. ఈ ద్రవ్యయజ్ఞము దినముకు మూడు లేదా నాలుగు మార్లు మనము మనకు తెలియకనే చేస్తున్నాము. ఈ యజ్ఞములో దహించు అగ్ని ఆత్మ చైతన్యము చేత స్రవింపబడి కలిసెడు రసముల చేత ఏర్పడినది. అందువలన అగ్నిని జఠరాగ్ని అని, కాల్చబడునవి ద్రవ్యములని తెలియుచున్నది. ఈ ద్రవ్యయజ్ఞమును ఉదాహరణముగా గీతయందు 15వ అ.14వ శ్లో. *'అహంవైశ్వానరో భూత్వా ప్రాణినాం దేహ మాశ్రితః ప్రాణాపాన సమా యుక్తః పచామ్యన్నం చతుర్విధమ్'* అన్ని ప్రాణుల దేహములందు నేను అగ్ని స్వరూపుడనై ఉండి వారు తినిన నాల్గురకముల పదార్థములను జీర్ణింప చేయుచున్నాను. అని దేవుడు కూడ తెల్పియున్నాడు.

దేవుడు తెల్పిన ఈ ద్రవ్యయజ్ఞము మనము నిత్యము మనకు తెలియకనే చేస్తున్నామంటే ఆశ్చర్యముగ ఉంటుంది కదా! నిజమేమరి మన మహర్షులు చెప్పిన తీయని మాటలు దేవుని ధర్మమునకు వ్యతిరిక్తముగ మనయందు ఇమిడి పోయాయి. కావున గుంతలు త్రవ్వి పుల్లలు వేసి కాల్చేటివే యజ్ఞములనుకొన్నాము. కావున ఈ విషయమున ఆశ్చర్యముగ ఉంటుంది. ద్రవ్యయజ్ఞము నిత్య జీవితములో తప్పనిసరి అయినది. దీనికొరకు ద్రవ్యములు కావలయును. ఆ ద్రవ్యముల కొరకు అనేక పనులు అయినది. ఆ ద్రవ్యముల కొరకు అనేక పనులు మానవుడు చేయుచున్నాడు. కర్మ వలన ప్రేరేపింపబడు కార్యములు చేతనే యజ్ఞములు జరుగుచున్నవి. అందువలననే గీతలో 4వ అ. 32వ శ్లో. *'ఏవం బహు విధా యజ్ఞ వితతా బ్రహ్మణో ముఖే కర్మజా'* దేవుని చేత చెప్పబడిన యజ్ఞములు కర్మ పనుల వలననే జరుగుచున్నవి. *'న్విద్ధితాన్ సర్వా నేవం జ్ఞాత్వా విమోక్షసే'* వీటిని తెలుసుకొనుట వలన మోక్షమెలా వచ్చునని అనుమానము రావచ్చును. దానికి సమాధానము వీటిని తెలియుట వలన వాటి వలన సంభవించు కర్మను తప్పించుటకు తగిన ఉపాయము తెలుసుకొని బయటపడవచ్చును. కూటి కొరకు కోటివిద్యలు అన్నట్లు ద్రవ్యయజ్ఞము కొరకు చేయు పనులన్నిటిలో కంటికి తెలియని కర్మ మనకంటుకొనుచున్నది. మనము నిత్యము చేయు పనులలో కొన్ని మంచివి కొన్ని చెడ్డవి ఉంటాయి. మంచి పనులు చేయుట వలన పుణ్యము చెడ్డ పనులు చేయుట వలన పాపము మనకు తెలియకనే మన కర్మచక్రమందు చేరుచుండును. ఇది ద్రవ్యయజ్ఞ సారాంశము. దీనివలన సంభవించు కర్మను నాశనము చేసుకొని జన్మల నుండి బయటపడాలంటే తప్పనిసరిగ జ్ఞానయజ్ఞము చేయాలి.

జ్ఞానయజ్ఞము మన శరీరములోని తలయందు జరుగుచున్నది. దీనియందు పాపపుణ్యమను కర్మలు కాలిపోవుచున్నవి. యోగశక్తి (జ్ఞానశక్తి) అనునది కర్మలు కాల్చివేయుచున్నది. చేయువాడు జీవుడే. జ్ఞానయజ్ఞములో ద్రవ్యయజ్ఞము ద్వార సంభవించు పాపపుణ్య కర్మలన్నియు నశించిపోవును. అందువలన గీత 4వ అ.. 37వ శ్లో.. *'జ్ఞానాగ్ని సర్వ కర్మాణి భస్మసాత్'* సర్వ కర్మలు జ్ఞానమను అగ్నిలో భస్మమైపోతాయి అన్నాడు.

నేడు అందరు ద్రవ్యయజ్ఞము చేసి కర్మల సంపాదించుకొన్నా, జ్ఞానయజ్ఞము చేసి కర్మల కాల్చువారు అరుదు. అందరి శరీరముల కడుపులో జఠరాగ్ని కొదవలేకుండ ఉంది, కాని తలయందు జ్ఞానాగ్ని లేకుండ పోయినది. అందువలన జ్ఞానయజ్ఞము చేయలేక పోవుచున్నారు. కర్మములను కాల్చలేక పోవుచున్నారు. మేము 'యోగులంటే ఎవరు' అని వ్రాసినపుడు యోగశక్తి (జ్ఞానాగ్ని) కల్గి కర్మల భస్మీపటలము చేయువారే యోగులు అని తెల్పగ నిజముగ అటువంటివారు భూమిమీద ఉన్నారా అని ఆశ్చర్యముగ ప్రొద్దుటూరు నుండి ఒకరు ప్రశ్నించారు దేవుడు చెప్పిన ప్రకారము నడుచుకొని జ్ఞానయజ్ఞము చేస్తే కర్మ కాలిపోదా! జరిగిన కాలమే కాదు, అనుసరిస్తే ఏ కాలములోనయిన కర్మను కాల్చు శక్తి మానవునికుంటుంది. విధానము తెలియక మనము కుంటుపడుచున్నాము. కాని సామత్యము లేక కాదు. నిజము చెప్పాలంటే బాహ్యయజ్ఞములలో నిమగ్నము చేసి అంతర్ముఖముగ ఉన్న దేవుడు తెల్పిన యజ్ఞముల మీదికి ధ్యాస లేకుండ చేసిన మన పెద్దలది తప్పు.

జ్ఞానయజ్ఞము చేయాలంటే మనము క్రొత్తగ జ్ఞానాగ్ని అను నిప్పును సంపాదించుకోవాలి. ఆ నిప్పు జ్ఞానయజ్ఞము చేయుచున్న వారి తలయందుంటుంది. కావున నిప్పు ఉన్న పొయ్యి నుంచి నిప్పులేని పొయ్యిని రగుల్చుకోవాలి. అందువలన జ్ఞానాగ్ని కల్గిన యోగుల వద్దగల అగ్నిని మన తలయందు వేయించుకొని జ్ఞానయజ్ఞము చేసి కర్మ బంధము నుండి ముక్తులు కావలయును. అందుకే యోగాగ్ని ఉన్న గురువుల చెంతకు మానవుడు పోవలసియున్నది. కొందరు గురువుల దగ్గరకు పోవుచున్నారు. కాని అగ్ని దానము చేయించుకోవడానికి కాదు. మంత్ర జపము చెప్పించుకోవడానికి జ్ఞానాగ్ని దానమె ఉపదేశమని తెలియక మంత్రదానమె ఉపదేశమనుకొనుచున్నారు. ఇప్పటికయిన మా పిలుపుతో మేల్కోండి. అధర్మములను ఖండించండి, ధర్మములను ఆచరించండి, గ్రుడ్డిగ నమ్మి నడవద్దండి, విమర్శించి ధర్మములను బయటకు లాగండి. నేను యోగశాస్త్రమైన గీత అధారముగ చెప్పిన మాటలివియని మరువకండి. అసూయ భావమును వదలండి. ఆత్మ ఔన్నత్యమును వెదకండి.

యజ్ఞము : ఉన్నదానిని లేకుండ కాల్చడము (శరీరములో జరుగుచున్నవి) గీత అ. 8,4వ శ్లో॥.

ద్రవ్యయజ్ఞము : జఠరాగ్నిలో ఆహార ద్రవ్యములు కాలిపోవుట (కడుపులో) అ. 14,15వ శ్లో॥.

జ్ఞానయజ్ఞము : జ్ఞానాగ్నిలో కర్మలు కాలిపోవును (తలలో జరుగుచున్నది) అ. 3,4,7వ శ్లోకములు.

చేయువాడు : జీవాత్మ

ఆధిపతి : ఆత్మ